విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 26 జూన్ 2024 | 8 పేజీలు

యథేచ్ఛగా 'ప్రైవేటు' దోపిడి

- యూనిఫామ్స్ పాఠశాలల్లో కొనుగోలు చేయాల్సిందే
- నోటుబుక్స్ కూడా వదలని ప్రైవేట్ యాజమాన్యం
- ఫీజులకు కళ్లెం వేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- లబోదిబోమంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విశాలాంధ్ర -ఒంగోలు : ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయా పాఠశాలల యాజమాన్యం చుక్కలు చూపిస్తున్నారు. యూనిఫామ్స్ నుండి పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల వరకు తమ వద్దనే కొనుగోలు ఇచ్చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఆయా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం చెప్పిన ధరకే కొనుగోలు చేయవలసిన పరిస్థితి విద్యార్థుల తల్లిదండ్రులలో నెలకొంది. అధిక ఫీజులు కట్టలేక, అధిక దట్లకు పుస్తకాలు యూనిఫామ్‌లు కొనుగోలు చేయలేక విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. అడ్మిషన్ల వ్యవహారంలోనూ మరింతగా దోపిడీ చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలో విద్యార్థులకు టెస్ట్ పెట్టి 80శాతం మార్కులు వచ్చిన విద్యార్థికి ఒక విధంగా, అంతకన్నా తక్కువ శాతం వచ్చిన విద్యార్థులకు మరింత భారమైన ఫీజులను కట్టించుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను లక్ష్యంగా చేసుకొని ఫీజుల రూపంలో వారి రక్తాన్ని పిండుతున్నారు. ఒంగోలులోని కొన్ని విద్యాసంస్థల్లో ఆరో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థుల వరకు స్కూలు యూనిఫామ్‌లు తమ వద్ద కొనుగోలు చేయాలని బాలురకు రూ.3వేలు వరకు, బాలికలకు రూ.3600 వరకు రెండు జతలు యూనిఫాములకు వసూలు చేస్తున్నారు. అలాగే స్కూల్ డైరీ, కాపీలు, కంప్యూటర్ బుక్స్ అంటూ మరో రూ.6వందల మేర వసూలు చేస్తున్నారు.ఇవి కాకుండా పాఠ్యపుస్తకాలు కూడా తమ వద్ద కొనుగోలు చేయాలంటూ, నోటు పుస్తకాలు తమ వద్దనే తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాల్గొని విద్యార్థులు తప్పని పరిస్థితులలో మిగతా 2 లో ...

దుక్కులు దున్ని..ఆకాశం వైపు!

- వర్షం కోసం రైతుల ఎదురు చూపు
- కలవర పెడుతున్న ఖరీఫ్ - జాడలేని వరుణుడు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : దుక్కులు దున్ని రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సాగుకు భూములను సిద్ధం చేసిన రైతులు పది రోజులుగా భూమి పదునయ్యే వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. పదును వర్షం కురిస్తే రైతులు ఖరీఫ్ పైర్లు సాగు చేసే అవకాశం ఉంది. యర్రగొండపాలెం మండలం వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం సాదారణ సాగు విస్తీర్ణం కంది 1225 హెక్టార్లు, పత్తి 2366 హెక్టార్లు, మిర్చి 2942 హెక్టార్లు, ఆముదం 44 హెక్టార్లు, వరి 7 హెక్టార్లు, మినుము 34 హెక్టార్లు, జొన్న 4 హెక్టార్ల విస్తీర్ణంలో విత్తనాలను విత్తుకు నేందుకు రైతులు సాగుకు భూములను సిద్ధం చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే మండలంలో సాదారణ సాగును మించి ఖరీఫ్‌లో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారి శేషిరెడ్డి తెలిపారు.

అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు కూల్చివేత 3 లో..

బాపట్లలో పేదలకు సాయం చేశా

- కలెక్టర్ రంజిత్ బాషా వెల్లడి
- బాపట్ల నుంచి కర్నూలుకు బదిలీ
- ఘనంగా వీడ్కోలు సన్మాన సభ

విశాలాంధ్ర - బాపట్ల : అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎంతమంది పేదలకు సహాయం చేశామనే అంశమే ఉద్యోగంలో సంతృప్తినిస్తుందని అధికారుల సహకారంతోనే 16 నెలలపాటు జిల్లా అభివృద్ధికి మంచిగా పనిచేసే అవకాశం లభించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆత్మీయ వీడ్కోల సన్మాన సభ మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో జరిగింది. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు కలిసి దుశాలువలు కప్పి పుష్ప మాలలతో ఘనంగా సన్మానించారు. బహుమతులు, జ్ఞాపికలు, పుష్పకిరీటంతో ఆయనను సత్కరించారు. ఎవరికి హాని చేయవద్దు, ఎవరిని ఇబ్బంది పెట్టరాదని అధికారులకు ఆయన సూచించారు. మీరు పని చేసే ప్రాంతంలో ప్రతి అంశాన్ని అవగాహన చేసుకుంటే మిగతా 2 లో ...

జగనన్న మహిళా మార్ట్‌లో అవకతవకలు

విచారణ జరిపించాలి : మెప్మా ఆర్పీలు

విశాలాంధ్ర-అద్దంకి : స్వయం సహాయక సంఘాల సభ్యుల పెట్టుబడితో మెప్మా ఆధ్వర్యంలో నడిపిన జగనన్న మహిళా మార్ట్‌లో అవకతవకలపై విచారణ జరిపి మార్ట్ ద్వారా వచ్చిన లాభాలను దిగమింగిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆర్పీలు అద్దంకి మున్సిపల్ కమీషనర్ సత్యన్నారాయణను మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల వద్ద రూ 10-20లక్షలు పెట్టుబడి కింద వసూలు చేసి మెప్మా ఆధ్వర్యంలో 2022 ఫిబ్రవరి 3న అద్దంకిలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు.మార్ట్ ద్వారా వచ్చే లాభాలను పెట్టుబడి పెట్టిన పొదుపు సంఘాల సభ్యులకు పంచాలి. మార్ట్ ప్రారంభించి రెండేళ్ళు గడుస్తున్నా ఇంతవరకూ మెప్మా అధికారిణి జమాఖర్చులు లెక్కలు ఇంతవరకు చూపించకపోడం పట్ల ఆమె తీరు పట్ల పలు విమర్శలు వెల్లువెత్తాయి. పెట్టుబడి పెట్టిన పొదుపు సంఘాల సభ్యులు తాము పెట్టిన పెట్టుబడిని ఆర్పీలను అడగడం ప్రారంభించారు. దీంతో ఆర్పీలు మార్ట్ లెక్కలు చెప్పాలని మెప్మా అధికారిణి ఫణికుమారిని నిలదీయడంతో మార్ట్‌కు సంబందించి కేవలం 3లక్షలు మాత్రమే లెక్కలు చెప్పి మిగత7లక్షలు కు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఆగ్రహించిన ఆర్పీలు కమీషనర్ సత్యన్నారాయణను కలసి మార్ట్‌లో జరిగిన అవకతవకలపై నిగ్గులేల్చాలని వినతిపత్రం అందజేశారు.

నెలవారీ టార్గెట్‌లు విధించి వేధించింది

మార్ట్‌లో స్వయం సమాయక సభ్యులచేత సరుకులు కొనుగోలు చేయించాలని నెలవారీ టార్గెట్లు విధించి తమని మెప్మా అధికారిణి వేధింపులకు గురిచేసిందని ఆర్పీలు వాపోయారు.వాస్తవంగా బయట మార్కెట్ కన్నా మహిళా మార్ట్‌లో సరుకుల ధరలు ఎక్కువగా ఉండటం,తూకంలో వ్యత్యాసం ఉన్నాగాని మార్ట్‌లోనే సరుకులు కొనాలని ఒత్తిడి చేసి టార్గెల్లు పూర్తిచేయని ఆర్పీల జీతాలు కట్‌చేసి ఇచ్చినట్లు ఆర్పీలు తెలిపారు.ఇక కొందరు ఆర్పీలు ఉద్యోగం కోసం అధికారిణికి రూ 30వేలు చెల్లించినట్లు తెలిపారు.రెక్కాడితేగాని డొక్కాడని కొందరు ఆర్పీలు మార్ట్ లో తప్పనిసరిగా సరుకులు కొనుగోలు చేయించాలని టార్గెట్ ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగాలు కూడా మానేసిన సందర్భాలు ఉన్నాయి. త్వరలో అద్దంకి ఎమ్మెల్యే రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రిని కలసి మహిళా మార్ట్‌లో జరిగిన అవకతవకల గురించి ,మెప్మా అధికారిణి తమ పట్ల వ్యవహరిస్తున్న తీరు గురించి వివరించనున్నట్లు ఆర్పీలు తెలిపారు.

సీఎంను కలిసిన ద్రావిడ దేశం కృష్ణారావు

విశాలాంధ్ర-ఒంగోలు : విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని జై శ్రీ కృష్ణ బీసీ సమితి వ్యవ స్థాపకులు, ద్రావిడ దేశం కృష్ణారావు కలిశారు. ముఖ్య మంత్రిని కలిసిన సందర్భంగా గత ప్రభుత్వం స్కిల్ డెవల ప్మెంట్ శాఖలో ఎటువంటి అవినీతి లేనప్పటికీ నారా చంద్రబాబు నాయుదుని ఇబ్బంది పెట్టాలని ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేసిన అంశంపై ద్రావిడ దేశం కృష్ణారావు వెంటనే స్పందించి ఈ సంఘటనను ఖండిస్తూ మొట్టమొదటిసారిగా వీడియోను రిలీజ్ చేసానని కృష్ణారావు చెప్పారు. అంతేకాకుండా తమిళనాడులోని తెలుగు వారంతా ఆందోళనకు గురై చెన్నైలో చేపట్టిన ధర్నా కార్య క్రమంలో ద్రావిడ దేశం కృష్ణారావు కూడా పాల్గొని జగన్ ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేయడం జరిగిందనియు అంతేకాక తమిళనాడులో ఉన్న తెలుగుదేశం అభిమానులు ముఖ్యంగా తెలుగువారు నారా చంద్రబాబు నాయుడు సేవలు ఆంధ్ర రాష్ట్రానికి ఎంతో అవసరమని భావించి ఇతర రాష్ట్రం నుండి వచ్చి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా కూటమి విజయానికి తమ ఓటు హక్కును వినియోగించుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ద్రావిడ దేశం కృష్ణారావు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి నాలుగో సారి ముఖ్యమంత్రిగా పదవి ప్రమాణం చేసిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. రెండు రోజుల కార్యక్రమం నిమిత్తం ఒంగోలు వచ్చినటువంటి ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించిన మొదటి మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్ కూడా ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు. సంతోష్ యాదవ్, ద్రావిడ దేశం కృష్ణారావు విజయవాడ వచ్చి అభినందనలు తెలియ జేసినందుకు ముఖ్యమంత్రి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన గిద్దలూరు ఆర్యవైశ్య నాయకులు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ఆర్యవైశ్య ముఖ్య నాయకులు రాష్ట్ర టీడీపీ నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి టీజీ భరత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ శివాపురం సురేంద్ర కుమార్, పెండ్యాల కిరణ్ కుమార్, రావూరి జనార్దన్ రావు, దేవకి వెంకటేశ్వర్లు మొదలైన వారు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని కలిసిన అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మంగళవారం అమరావతి గ్రౌండ్ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మరియు కమిషనర్ టీవీ రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పురపాలక సంఘములో ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారోత్సవమునకు ఆహ్వానించడం జరిగినది. శాసన సభ్యులు ఉగ్ర అందుకు అంగీకరించి తేదీ 27వ తేదీన పురపాలక సంఘ కార్యాలయంనకు వస్తున్నట్లు అబ్దుల్ గఫూర్ తెలిపినారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : తాగునీటి సమస్యలపై అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు, స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం డయోరియా నివారణ కార్యాచరణ ప్రణాళిక చర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కార్యదర్శిలు ఇంజినీరింగ్ సహాయకులు ఏఎన్ఎం లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగాఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి ఓహెచ్ ఎస్ఆర్ కడిగించాలని బోర్డు మీద ఏపి తేదీలలో కడిగింది ప్రజలకు తెలిసే విధంగా రాయించాలని తెలియజేశారు. ప్రతి సారి నీటిని వదిలే టప్పుడు నీటిని క్లోరినేషన్ చేసిన 45 నిమిషాల తరువాత విడుదల చేయాలని సూచించారు. పైప్ లైన్ లీకేజీల మరమత్తులు వెంటనే చేపట్టాలని వాల్స్ ఛాంబర్ లలోలేకులు లేకుండా నీరు నిల్వ ఉండ కుండా చూడాలని కోరారు. సైడ్ డ్రయిన్ ప్రక్కన కానీ క్రింద కానీ త్రాగునీరు పైప్ లైన్ వున్నట్లయితే త్రాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మరమ్మతులు ఉంటే వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఓహెచ్ ఎస్ఆర్‌ల పై భాగంలో మూత లేకుండా ఉన్నాయడల పక్షుల కోతులు పడకుండా మూతలు ఏర్పాటు చేయాలన్నారు. నిచ్చెనలు మరమ్మతులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని తగినంత బ్లీచింగ్ ద్రవరూప క్లోరిన్ పంచాయతీ లో అందుబాటులో ఉంచుకోవాలి, ప్రతి రోజూ క్లోరినేషన్ చేస్తున్నందున నీటి సరఫరా చివరి కుళాయి వద్ద శాంపిల్ తీసి అక్కడ 0.2 పిపిఎం ఉండేవిధంగా చూడాలి. ప్రతి పంచాయతీ క్లోరినేషన్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలి. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా కార్యదర్శుల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఏఎన్ఎం లు ప్రజలకు సురక్షిత త్రాగునీరు సరఫరా చేసేందుకు నిరంతరం వ్యక్తి గత పర్యవేక్షణ జరగాలని చూసించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ఈవో పి ఆర్ ఆర్ డి రాధిక పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

విశాలాంధ్ర-టంగుటూరు : పొందూరు గ్రామంలో నిర్మించిన కామ్రేడ్ పమిడి కోటయ్య వెంకట శేషమ్మ విజ్ఞాన కేంద్రంలో వెంకట శేషమ్మ జన్మదినం సందర్భంగా ఈ సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జంపాని పల్లవి అనే విద్యార్థినికి ఉన్నత చదువుల కోసం విజ్ఞాన కేంద్రం నిర్మాణ దాతలు అయినా వారి కుటుంబ సభ్యులు కోటయ్య కుమార్తె పమిడి మీనా కుమారి 20 వేల రూపాయల నగదును అందజేశారు. వారు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం తరపున ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు చదువు విషయంలో ఆర్థిక తోడ్పాటును అందిస్తామని భవిష్యత్తులో వారి ఉన్నత చదువులకు విజ్ఞాన కేంద్ర తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ అధ్యక్షులు కాట్రగడ్డ రమేష్ బాబు ఎంపీటీసీ సభ్యులు పమిడి నాగేశ్వరరావు ఆనంద్ రావు పాల్గొన్నారు.

బాపట్లలో పేదలకు సాయం చేశా

(మొదటిపేజీ తరువాయి)

మీ విధులు సులభతరం అవుతుందన్నారు. అదే సమయంలో అక్రమాలు పూర్తిగా అరికట్టగలమన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఇద్దరూ సోదర భావంతోనే అన్నింటిలోనూ నాకు సహకరించారని అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు జిల్లాకు ఒక వనరుగా నిలిచారని కితాబిచ్చారు. అందువలనే బాపట్లలో సాధారణ ఎన్నికలు సమర్థంగా నిర్వహించామన్నారు. బాపట్ల జిల్లాలోని అధికారులంతా కుటుంబ సభ్యులుగానే మెలగడం, పనిచేసిన తీరు మరువలేనిదని చెప్పారు. మీ పరిధిలో ఉన్న పేద ప్రజలకు ఖచ్చితంగా సేవ చేయాలనే తాత్పర్యం కలిగి ఉండాలన్నారు. 2008లో కడప జిల్లాలో ఆర్డీవో గా పని చేసినప్పటి నుంచి సాధించిన విజయాలను ఆయన వివరించారు. సిసిఎల్ఏ లో పిడిసిఎంఆర్ గా పని చేసినప్పటి నుంచి ఈ క్రాప్ విధానం ప్రవేశ పెట్టడం, ల్యాండ్ రికార్డ్స్ ను మీ భూమి పోర్టల్ ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. భూమిని జియోట్యాగ్ చేసే సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టామని, అప్పట్లో మన దేశంలోనే మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా పనిచేశానని తన అనుభవాలను పంచుకున్నారు. క్లిష్టమైన పరిస్థితిలోనూ ఎన్నికలు సమర్థంగా నిర్వహించిన మంచి అధికారి, నాయకుడిగా జిల్లా కలెక్టర్ నిలిచారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. చిన్న సమస్యలు, ఎలాంటి తప్పులు లేకుండా ఎన్నికలు జయప్రదంగా నిర్వహించారన్నారు. ముందుగా ఎదురయ్యే సంఘటనలు, పరిస్థితుల వలన సమస్యలు ఉత్పన్నం గాకుండా సూక్ష్మ ప్రణాళికతో పనిచేశారని వివరించారు. నియమ నిబంధనలను జిల్లా కలెక్టర్ పక్కాగా అమలు చేయడం, ప్రతి అంశంపై అవగాహన, పట్టు ఉండడంతోనే ఎన్నికలు సజావుగా సాగాయన్నారు. బాపట్లలో మంచి పేరు సంపాదించారని, అలాగే కర్నూలు జిల్లాలోనూ మంచి పేరు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్రమించే తత్వం, ముందు చూపు, సూక్ష్మ ప్రణాళికతో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సమర్థంగా పనిచేశారని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. పరిపాలన వ్యవస్థకు మార్గ నిర్దేశం చేయడం, వ్యవస్థతో చక్కగా పనిచేయించడం వంటి నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిగా నిలిచారన్నారు.

బాపట్ల జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లారని ప్రశంసించారు. అన్ని అంశాలు, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండడంతో అన్ని రంగాలలో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా 5వ స్థానంలో నిలిచిందని వివరించారు. గడిచిన మూడేళ్లు జిల్లా కలెక్టర్ తో పని చేసిన అనుభవాలను ఆయన పంచుకున్నారు.

ముఖ్యంగా మానవ వనరులు సద్వినియోగం చేసుకోవడం, అధికారులు, ఉద్యోగులకు బాధ్యతలు కేటాయించే అంశం మేనేజ్మెంట్ చేయడం అభినంద నీయమన్నారు. మంచి విలువలతో పనిచేశారని, ఎన్నికలలోనూ ఇతర జిల్లాలకంటే బాపట్ల ఉత్తమ జిల్లాగా నిలిచేలా సేవలందించారన్నారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ వీడ్కోల సన్మాన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, చీరాల, రేపల్లె ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా 'ప్రైవేటు' దోపిడి

(మొదటిపేజీ తరువాయి)

అధిక ధరలు వీక్షించి బుక్స్ యూనిఫాంలో కొనుగోలు చేస్తున్నారు. పాము పడ్డ కష్టం తమ పిల్లలు పడకూడదని లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూలి నాలి చేసి తమ పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో మంచి చదువు చదివించాలని లక్ష్యంతో కష్టపడి చదివిస్తున్నారు. ఇటువంటి పేదవారు స్కూల్ యాజమాన్యాలు నిర్దేశించే ఫీజులు పెనుభారంగా మారుతున్నాయి. స్కూల్ ఫీజులు కూడా ఏడాదికి ఏడాదికి మూడు నుండి ఐదు వేల మేర పెంచుకుంటూ పోతున్నారు. ఇదేమని ప్రశ్నించలేని ధన్యస్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. గతంలో పేదలు ఎక్కువ భాగం ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చదివించేవారు. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్య ప్రమాణాల నాణ్యత కొరబడింది.

దీంతో మంచి విద్య కావాలంటే ప్రైవేటు పాఠశాలలే శరణ్యమని విద్యార్థుల తల్లిదండ్రులు భావించారు. ఎంత ఖర్చైనా భరించి మంచి విద్యని చెప్పించదామని లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపించడం ప్రారంభించారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం తమ విద్యా సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చారు.

విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలకు కావాల్సింది ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య తప్ప చిక్కీలు, గుడ్లు, మధ్యాహ్న భోజనాలు కాదని పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా ప్రమాణాలు పెంచే దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని సంగాపురం పంచాయతీ వీరేపల్లి గ్రామంలో భారీగా అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.సుందర రామయ్య తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విప్పర్ల బాలకోటయ్య తమ పశువుల పాకలో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు సమాచారం రావటంతో తమ సిబ్బందితో తనిఖీలు చేసి 1077 మద్యం సీసాలు, 146 బీరు సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని సుందర రామయ్య తెలిపారు. ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్ చక్రవర్తి, స్టేషన్ సిబ్బంది, విఆర్ఓ హుస్సేన్ పాల్గొన్నారు.

ఏపీ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఉప్పలపాటి

విశాలాంధ్ర-పెద్దారవీడు : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా పెద్దారవీడు మండలం స్థానికవరం గ్రామానికి చెందిన ఉప్పలపాటి నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు, ఆ మండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు నియామక పత్రం అందజేసినట్లు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నాగయ్య తెలిపారు. విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గల సమావేశ మందిరంలో జరిగిన ఏపీ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర సమావేశంలో ఈ నియామకం జరిగినట్లు నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అణగారిన పేద బడుగు బలహీనవర్గాలకు అండదండగా ఉంటానని, ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం, సాధన కోసం మరియు వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు తనపై ఉంచిన నమ్మకాన్ని విశ్వాసాన్ని కాపాడుతూ పని చేస్తానని నాగయ్య తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీల కార్మిక, రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ ఈ బాధ్యతలు ఇచ్చిన బుల్లా రాజారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని గొట్లగట్టులో వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మలేరియా నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి మీదగా బ్యాంకు వరకు, అక్కడ నుంచి బస్టాండ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి హెచ్ఈఓ నారాయణరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ జే.వెంకటేశ్వర్లు, హెల్త్ విజిటర్ భారతి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాల గురవయ్య, ఏఎన్ఎం ఆరిఫా పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

విశాలాంధ్ర-పామూరు : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో పి పుట్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సకాలంలో సమావేశమునకు హాజరు కావలసిందిగా ఎంపీడీవో పుట్టారెడ్డి కోరుచున్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడులో ఉన్న విత్తనాలు పురుగు మందుల షాపులపై మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు నీరజ దర్శి సబ్ డివిజన్లోని కురిచేడు గ్రామములో ఉన్న విత్తనాలు పురుగుమందు షాపులపై తనిఖీలు నిర్వహించారు. విత్తన అమ్మకం లైసెన్సులు సోర్స్ ఆ ఫ్లే ఇన్వాయిస్ డీలర్స్ రైతులకు ఇచ్చే రసీదులు విత్తనాల నిల్వలు రికార్డులను పరిశీలించడం జరిగింది. డీలర్స్‌కు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురిచేడు మండల వ్యవసాయ అధికారి పి మధుబాబు పాల్గొన్నారు.

అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు కూల్చివేత

విశాలాంధ్ర-టంగుటూరు : అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన పొగాకు బ్యారెన్‌ను పంచాయితీ అధికారులు కూల్చివేశారు. గతంలో ఈ పొగాకు బ్యారెన్ వివాదంలో టంగుటూరు ఎస్సై అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు, దీనితో పొగాకు బ్యారెన్ కూల్చివేత మండలంలో చర్చానీయంశమైనది. టంగుటూరు మండలం కాకుటూరు వారి పాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్ కే జానీ భాష తెలిపిన వివరాల ప్రకారం సర్వే నంబర్ 519/2లో 61వ ప్లాట్లో మార్టూరు వెంకట్రావు అనే వ్యక్తి అనుమతులు లేకుండా పొగాకు బ్యారన్ నిర్మించారని తెలిపారు. పక్కనే ఉన్న బీసీ కాలనీకి చెందినవారు అనుమతులు లేకుండా ఇళ్ల మధ్యలో బ్యారెన్ నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేసారని తెలిపారు. అక్రమ నిర్మాణానికి సంబంధించి పంచాయతీ వారు నోటీసులు జారీ చేయడంతో మార్టూరు వెంకటరావు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. హైకోర్టు నుండి పంచాయతీ కార్యాలయానికి ఆరు వారాలలో దీనిమీద విచారణ జరిపి నిగ్గు తేల్చాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. దీంతో పొగాకు బోర్డు వారికి తెలియజేయగా కాకుటూరు వారిపాలెంలో నిర్మిస్తున్న పొగాకు బ్యారన్ అనాధరైజుడ్ అని తెలిపారు. అంతేకాకుండా ఒంగోల్ అర్బన్ డెవలప్మెంట్ వారికి తెలుపగా ఈ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని దీనిమీద పంచాయతీ వారే చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

మాటూరు వెంకటరావు అనే వ్యక్తి పొగాకు బేరం నిర్మిస్తూ కోర్టు వారికి సైతం గోడౌన్ నిర్మిస్తున్నామని తెలిపారు ఈ నిర్మాణంపై హైకోర్టు వారు సమగ్రంగా విచారించి అక్రమ నిర్మాణానికి పాల్పడితే తగు చర్యలు తీసుకోమని ఆదేశించారు. పొగాకు బేరం నిర్మిస్తున్న దాని పక్కనే ఉన్న సర్వేనంబర్ 520లో పంచాయతీకి సంబంధించిన డొంకు స్థలం ఉంది దానిలో మూడు గదులు ఆక్రమణకు గురై ఉన్నదని టంగుటూరు తహసీల్దార్ ధ్రువీకరించారని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఎటువంటి అనుమతులు లేకుండా పంచాయతీ స్థలం కబ్జా చేసి పొగాకు బేరం నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది మరియు టంగుటూరు పోలీసులు పాల్గొన్నారు.

వైస్ఎంపీపీ సుజాత ఇంట్లో చోరీ

రూ.2లక్షల నగదు అపహరణ

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల రెండవ ఉపాధ్యక్షురాలు కందుల సుజాత ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం మండలంలోని నాగేళ్ల ముడుపు గ్రామానికి చెందిన మండల రెండవ ఉపాధ్యక్షురాలు కందుల సుజాత, భర్త తిరుపాలు మరియు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వివాహ వేడుకలకు వెళ్లడం జరిగిందన్నారు. వేడుకలనంతరం మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువతాళాలు తీసి అందులో ఉన్న 72,500 నగదు, ఉంగరాలు, కమ్మలు మొత్తం సుమారు రెండు లక్షల రూపాయలు విలువ చేసే వస్తువులు పోయినట్లు తర్లుపాడు మండల ఎస్సై వేముల సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై వేముల సుధాకర్ హుటాహుటిన సంఘటన స్థలానికి క్లూస్ టీంతో చేరుకొని ఆధారాలు సేకరించారు. వీరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మా గుంటకు శుభాకాంక్షలు తెలిపిన మూలగుంటపాడు టీడీపీ నాయకులు సత్య

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ఢిల్లీలోని పార్లమెంటు సమావేశ మందిరంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సింగరాయకొండ మూలగుంటపాడుకి చెందిన టిడిపి నాయకులు ముల్లపూడి సత్యనారాయణ. స్వర్ణ హరిబాబు. ఎస్ .వీర రాఘవులు. ఢిల్లీ వెళ్లి శ్రీనివాసరెడ్డి నివాసంలో ఆయన్ని కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు రావు కృష్ణదేవరాయలను కూడా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు.

చివరి భూములకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఇప్పటికైనా ప్రస్తుతం వున్న ప్రభుత్వం చివరి భూముల పంట సాగుకు నీరు అందించాలని సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి డి శ్రీనివాస్ డిమాండ్ చేసారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. ఎక్కడ సరైన ఎరువు, విత్తనాలు ఇచ్చిన ఆనవాళ్లు లేవని అన్నారు. రైతులు ముందుగా డబ్బు చెల్లించి రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు బుక్ చేసుకోవాలని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు దరలేక, విపత్తులకు నష్టపోయిన పంటకు బీమా రాక చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. చివరి భూములకు నీళ్ళు అందించే క్రమంలో ఎన్నెస్పి అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా వున్న నాగార్జున సాగర్ ప్రధాన కాల్వ, మేజర్ కాలువల మరమత్తులు చేయడం మరచారని అన్నారు. ఎన్ని సార్లు సిపిఐ, రైతు సంఘాలు ఆధ్వర్యంలో వినతులు అందించిన తగు చర్యలు శూన్యం అన్నారు. నివేదికలు పంపడం జరిగిందని అధికారులు చెపుతూ వచ్చారు కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మరమత్తులకు హెచ్చించడం జరగలేదని అన్నారు.

నీటి పన్ను, భూమి పన్ను రూపంలో వెలకు వేల రూపాయలు ప్రజల వద్దనుండి వసూలు చేశారు కానీ వాటిని ఖర్చు చేయలేదని అన్నారు. సాగర్ ప్రధాన కాలువ పై వున్న మట్టి కుప్పలను అమ్ముకోవడానికి చూపిన శ్రద్ధ మరమత్తులు చేయడంలో చూపలేదని శ్రీనివాస్ అన్నారు. మాముళ్ల మత్తులో అధికారులు వుండటం మట్టి మాఫియా నాయకులకు మంచి లాభదాయకం అయిందన్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం చివరి భూములకు నీళ్ళు అందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యాం బేగ్, మల్లికార్జున, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

కూర 'గాయాలు'

విశాలాంధ్ర-ముండ్లమూరు : కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కూరగాయల పంటలు తక్కువగా పడటంతో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ముండ్లమూరు బస్టాండ్ సెంటర్లో ఏర్పాటుచేసిన కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. దోసకాయలు కేజీ 40 రూ, ఉల్లగడ్డ 50 రూ, పచ్చిమిరప కాయలు 70 రూ.టమాటా కేజీ 80రూ, బెండకాయలు 60 రూ, దొండకాయలు 60 రూ.క్యారెట్ కేజీ 60 రూ, బీరకాయ కేజీ 80 రూ, క్యాబేజీ 50 రూ.సొరకాయ 40 రూ, గుడ్లు ట్రే 180 రూ,బీట్ రూట్ 50 రూ, చిక్కుడు 60 రూ.తెల్ల గడ్డలు కేజీ 200 రూ. వంకాయ కేజీ 40 రూ, కొత్తిమీర కట్ట 50 రూ, పుదీనా కట్ట 30 రూ.కాకర కాయలు కేజీ70 రూపాయలుగా ఉండటంతో సామాన్య ప్రజలు ఏమి కొనాలో అర్థం కాక సగం కూరగాయలు కొనుగోలు చేస్తున్నామని, గతంలో 200 రూపాయలకు సరిపడా కూరగాయలు తీసుకెళ్లే వారమని, ఇప్పుడు 500 రూపాయలు వెచ్చించిన సరిపోవడం లేదని వాపోతున్నారు.

భూ సార పరీక్షలు ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రైతులు పొలాలలో మట్టి నమూనాలను సేకరించి తద్వారా పంట దిగుబడి వచ్చే పంటలను వేసుకోవాలని వ్యవసాయ అధికారి డి.జవహర్లాల్ నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని దోర్నాల మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామంలో భూసారా పరీక్ష మీద రైతులకు మండల వ్యవసాయ అధికారి జవహర్ లాల్ నాయక్ అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రైతుల పొలంలో మట్టి సేకరణ, మట్టి పరీక్ష ఆవశ్యకత, ప్రయోజనాలు, మట్టి నమూనా సేకరణ విధానం ప్రయోగాత్మకంగా రైతులకు చూపించడం జరిగింది.

బాధితురాలికి ఆర్థిక సహాయం



విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సూర్య శ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా ఆధ్వర్యంలో అత్యాల మేరీకి ప్రమాదవశాత్తు గ్యాస్ పేలి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వారికి ట్రస్ట్ కార్యాలయం నందు ట్రస్ట్ వ్యవస్థాపకులు మందవ మురళీకృష్ణ ద్వారా పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం అయినది. సర్దార్ మాట్లాడుతూ ఒంగోలు చంద్రయ్య నగర్కు చెందిన మేరీకి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ఆమెకు రెండు కిడ్నీలు చెడిపోయి వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటుంది. ఈ దశలో సూర్య శ్రీ ట్రస్ట్ ను సంప్రదించగా దాత అనిల్ పోలవరపు సహకారంతో మంగళవారం ఆర్థిక సాయం అందజేయడం అయినది. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ మేరీ కి రాము సాకేత్ సంజయ్ ముగ్గురు పిల్లలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంది కుటుంబ పోషణ కష్టంగా ఉన్న ఈ దిశలో సూర్య శ్రీ ట్రస్ట్ మానవత్వంతో దాతల సహకారంతో ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచింది. ఈ సేవ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్ పర్సన్ షహనాజ్. డీలర్స్ సుబ్బారావు. జనసేన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దళిత నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ను దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం ఆయన చాంబర్లో కలిశారు. అనేక కారణాల వల్ల కొర్రీలు పడుతున్న ఎస్సీ ఉద్యోగుల, ఎస్సీ ఎస్టీ కేసుల రిలీఫ్ ఫైళ్ళను క్లియర్ చేయాల్సిందిగా దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కలెక్టర్ ను కోరారు. కో ఆపరేటివ్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తూ మరణించిన ఎస్సీ ఉద్యోగి నాపూరి రామకృష్ణ అన్నకు ఉద్యోగం ఇచ్చేందుకు రూల్స్ లేవని జేసీ కొర్రీ వేశారని, ఉద్యోగం మంజూరులో పెళ్లయిన కుమార్తెకు ఉన్న హక్కు పెళ్లయిన కుమారుడికి లేదని చెప్తున్నారని నాగేంద్ర కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నరాచి రెస్టారెంట్ వద్ద ఎస్సీ యువకుడు మొలతోటి వెంకటరావు హత్య జరిగి ఏడాది అయినా రిలీఫ్ ఇవ్వలేదని నాగేంద్ర కలెక్టర్కు తెలిపారు. డిప్యుటేషన్‌పై వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగి కొమ్ము గోపాలరావును మాతృశాఖకు పంపాలని నాగేంద్ర, కొమ్ము సుజన్ మాదిగలు కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ నాపూరి రామకృష్ణ కారుణ్య నియామకం పట్ల, కొమ్ము గోపాలరావును మాతృశాఖకు పంపేందుకు, మొలతోటి వెంకటరావు కుటుంబ సభ్యులకు రిలీఫ్ ఇచ్చేందుకు అంగీకరించి, ఫైలు పెట్టాలని డీఆర్ఓ రామిసెట్టి శ్రీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ లను ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దళిత నాయకులు కాకుమాను రవి, ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగి కొమ్ము గోపాలరావు ఉన్నారు.

ఆక్రమ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండల కేంద్రమైన సంతనూతలపాడు సమీపంలోని తంబళ్లకుంట వాగు ప్రాంగణంలో గల జగనన్న ఇళ్ల నిర్మాణాల కాలనీ ముందు వైపున ఉన్న వాగు పోరంబోకు భూమిలో అక్రమ పార్కు నిర్మాణాలు తొలగింపు పై రెవెన్యూ మండల పరిషత్ పోలీస్ శాఖ అధికారులు సందర్శించి వాటిని మంగళవారం పరిశీలించారు. 220/1 సర్వే నంబర్ లోని వాగు పోరంబోకు చెందిన 2.96 ఎకరాల భూమి కలదని ఈ వాగు పోరంబోకు భూమి నందు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పార్కును నిర్మించి 2 అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్టు తహశీల్దార్ ఎస్ కె మీరావలి పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక ఇంటి నిర్మాణానికి బేస్ మట్టం వేసి ఉన్నారని దీనిపై స్థానికులు కొందరు వీటి తొలగింపు పై హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఉత్తర్వులు మేరకు వాగు పోరంబోకు భూమి పొజిషన్ పై పరిశీలించమన్నారు. వాగు పోరంబోకు భూమికి సమగ్ర సర్వే చేయాలని సచివాలయం సర్వే యర్ సాయి కిరణ్‌ను తహసిల్దార్ మీరావలి ఆదేశించారు. వాగు పునరుద్ధరణ అంచనాలు వెయ్యాలని ఎంపీడీవో ఎం. శ్రీహరి పంచాయతీ రాజ్ ఏ ఈ రవి బాబుకు సూచనలు ఇచ్చారు. దీనిపై వాగు పోరంబోకు ఆక్రమణల పై టిడిపి నాయకులు కుంచాల జోగిరాజు తదితరులు చర్యలు నిమిత్తం హైకోర్టును ఆశ్రయించారు. వాగు పోరంబోకు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తాహ సిల్దార్ మీరావాలికి ఆదేశాలు జారీ చేశారు. వాగు పోరంబోకు భూమిని పక్కాగా పూర్తిగా సర్వే చేసి ఆక్రమణలను తొలగించనున్నట్టు తాహ సిల్దార్ మీరావాలి వెల్లడించారు. వాగు పోరంబోకు భూమి పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం శ్రీహరి పి ఆర్ ఏఈ పి రవిబాబు విఆర్ఓ విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి, మాజీ జెడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు పలువురు ఫిర్యాదు దారులు పాల్గొన్నారు.

వామపక్షాలతో కలిసి రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఒంగోలు : స్వతంత్ర బలంతో సిపిఎం అభివృద్ధి చెందాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు - ప్రజలిచ్చిన తీర్పు మీద మంగళవారం సుందరయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారానే తమను తిరిగి అధికారంలోకి తెస్తారని వైసీపీ ఆశించిందని, ఆ పథకాల కంటే ప్రజల మీద వేసిన భారాలు, కేంద్ర ప్రభుత్వం వేసిన భారాలు కలిసి వైసీపీ ప్రభుత్వ పరాజయానికి దారి తీశాయని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి అడ్డగోలుగా కేంద్రానికి అండగా నిలబడటం, ప్రజా వ్యతిరేక చట్టాలకు ఆమోదం తెలపటం కూడా వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజలు వ్యతిరేకత చూపారని అన్నారు. ఉద్యోగ వర్గాలను, నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరించిందని, అమరావతిలో రాజధాని కాదని, మూడు రాజధానులంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రజలు తిరస్కరించారని అన్నారు. గత ప్రభుత్వం పరిశ్రమలు, ప్రాజెక్టుల నిర్మాణం గాలి కొదిలేసిందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీని ఓడించాలనే ప్రజా వ్యతిరేకత టిడిపికి దోహద పడిందని, టిడిపి జనసేన బిజెపి కూటమి ఏర్పడటం, వైసీపీ కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సూపర్ సిక్స్ లాంటి పథకాలు ప్రకటించడం ఈ కూటమికి బాగా లాభించిందని, అత్యధిక సీట్లు అత్యధిక ఓట్లు రావడానికి దారి తీసింది అన్నారు. దేశమంతా ప్రజలు బిజెపిని ఓడిస్తే రాష్ట్రంలో మతోన్మాద బీజేపీ పెరుగుదలకు టిడిపి కూటమి కట్టడం దోహద పడిందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ జిల్లాలోఎన్నికలలో పార్టీ నిర్వహించిన కృషి వివరించి భవిష్యత్ కర్తలను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, దగ్గుబాటి సోమయ్య, ఎం రమేష్, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27న బండ్లమ్మ కానుకల హుండీలు లెక్కింపు

విశాలాంధ్ర - పిట్లవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో గల 5 కానుకల హుండీలను ఈ నెల 27న గురువారం ఉదయం 10 గంటలకు లెక్కింపు జరుగుతుందని దేవస్థాన ఈఓ జి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ గుంటూరు వారి ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ బాపట్ల వారి పర్యవేక్షణలో పొన్నూరు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజర్ వారి సిబ్బందితో ఈ హుండీల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ, రెవెన్యూ శాఖ, చందోలు గ్రామపంచాయతీ, చందోలు పోలీస్ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అన్న క్యాంటీన్ల పునఃరుద్ధరణకు పేదల నిరీక్షణ

ఐదేళ్లుగా అన్న క్యాంటిన్ మూత

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని నడిబొడ్డులో గ్యాస్ కంపెనీ రోడ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్కులో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూత పడిపోయింది. ఐదేళ్లుగా అన్న క్యాంటీన్ స్థానంలో వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూతపడిన అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించడంతో భోజన ప్రియులు అన్న క్యాంటీన్ ఎప్పుడు ప్రారంభిస్తారా ఎదురుచూస్తూ ఉన్నారు. ఇందులో కొంతకాలంగా వార్డు సచివాలయం ఉండేది. సచివాలయాన్ని ఖాళీ చేయడంతో అన్న క్యాంటీన్ బిల్డింగుకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా టిడిపి నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్ బిల్డింగ్ మరమ్మతు పనులు చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు. పట్టణంలో అంబేద్కర్ పార్క్ నందు గల అన్న క్యాంటీన్ ఒక్కటే కావడంతో భోజన సమయంలో బాగా రద్దీగా ఉంటున్నది. అందువలన రేపల్లె పట్టణంలో మరొక రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేద, మధ్యతరగతి ప్రజలకు భోజనం అందుబాటులో ఉండే విధంగా మంత్రి సత్యప్రసాద్ తగు చర్యలు తీసుకోవాలని పేద, మధ్యతరగతి ప్రజల కోరుతున్నారు. అంతేకాకుండా పట్నంలో ప్రైవేట్ హోటల్స్ లో భోజనం 120 నుండి 150 రూపాయలు వరకు ఉండటంతో రోజువారి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, పేద, మధ్యతరగతి వర్గాల వారు ఎక్కువ రేటు భోజనానికి ఖర్చు చేయాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కర్రీ పాయింట్లు రేపల్లె పట్టణంలో అధికంగా వెలిశాయి. అన్న క్యాంటీన్ ప్రారంభించి పేద మధ్యతరగతి ప్రజలకు ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూతబడిన అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించి పేద ప్రజలకు ముఖ్యంగా భోజన ప్రియులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొక్కు తీర్చుకున్న కార్యకర్తలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గత సార్వత్రిక ఎన్నికలు తెదేపా, భాజపా, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు, అప్పటి అధికార వైకాపా అభ్యర్థులకు మధ్య హోరాహోరీగా ఎన్నికల పోటీ జరిగింది. చీరాల నియోజక వర్గం నుండి కూటమి అభ్యర్థిగా మద్దు లూరి మాల కొండయ్య, వైకాపా అభ్యర్థిగా కరణం వెంకటేష్, భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి కృష్ణ మోహన్ లు పోటీ చేశారు. జూన్ 4 వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాలలో కూటమి అభ్యర్థి ఎం ఎం కొండయ్య తన సమీప ప్రత్యర్థి కరణం వెంకటేష్‌పై 20వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీనితో కూటమి శ్రేణులు వివిధ దేవాలయాల్లో మొక్కులు చెల్లించుకుంటున్నారు. అందులో భాగంగా చీరాల మండలం గవినివారి పాలెం గ్రామానికి చెందిన గవిని అయ్యప్ప, ముక్క సాంబశివ రావు, నక్కల మురళీ, గోపిలు ఉత్తర భారత దేశంలో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రం కేదార్ నాథ్ లోని పరమేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో చీరాలలో కూటమి అభ్యర్థికొండయ్య విజయం సాధించడం తమకెంతో సంతోషం కలిగించిందన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి: ఎంఈఓ

విశాలాంధ్ర - యద్దనపూడి : బడి ఈడు పిల్లలు నూరు శాతం బడిలో ఉండాలని ఎంఈఓ 2 చెరుకూరు గోపి అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను బడికిపోతా విద్యా ప్రవేశ్ కార్యక్రమంలో భాగంగా నేను బడికిపోతా" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి బడిబయట ఉన్న బడి ఈడు పిల్లలు గుర్తించాలన్నారు. జూన్ నెల చివరి నాటికి అందరి సహకారంతో పిల్లలందరినీ తప్పక బడుల్లో చేర్చాల న్నారు. 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసు కల విద్యార్థులందరూ బడుల్లోనే ఉండాలని నేను బడికిపోతా విద్యాప్రవేశ్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. ప్రతిరోజు పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థులు కనీస సామర్థ్యాలు పొందేలా చూడాలన్నారు. కొత్తగా బడిలో చేరిన 1వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజూ 2 గంటల పాటు భాషా, జ్ఞాన మరియు శారీరక అభివృద్ధి కృత్యాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసరావు, వెస్లీ, వెంకటనారాయణ, కాలేషావలి, ఎన్ మార్కు కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు అందరూ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టించాలి

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలోని ప్రైవేట్ స్కూల్లు, కాలేజీలలో అధిక మొత్తంలో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. అంతేకాకుండా అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలను ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేసే స్కూళ్లపై కాలేజీలపై చర్యలు తీసుకోవాలి అని ఎస్.ఎఫ్.ఐ.చీమకుర్తి మండల కమిటి చీమకుర్తి మండల ఎంఈఓ కె.శివాజీకి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ వినతిపత్రంలో ముఖ్యంగా అధిక ఫీజులు వసూళ్లు చేసే ప్రైవేట్ స్కూళ్లు మరియు కాలేజీలు ఫీజులు తగ్గించి ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టే విధంగా మరియు పాఠ్యపుస్తకాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి అని ఎస్.ఎఫ్.ఐ. జిల్లా ఉపాధ్యక్షుడు జి. దేవరాజు మరియు మండల అధ్యక్షుడు వాసు బాబు, మండల నాయకులు ఎస్.కె. నాగుల్ మీరా, ఇత్తడి శ్రీకాంత్, దుర్గారావు, ఎంఈఓ. కె.శివాజీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

మాజీ ఎంఈఓ తండ్రి మృతిపై ఏపీటీఎఫ్ సంతాపం

విశాలాంధ్ర-చీమకుర్తి : మంచి మనిషి, నిగర్వి, మంచి సేవా భావం కలిగిన వ్యక్తి, చీమకుర్తి మండల వీఆర్‌ఏగా సుదీర్ఘ కాలం సేవలు అందించిన మా ఆత్మీయ మిత్రులు చీమకుర్తి మండల విద్యాశాఖాధికారిగా పనిచేసిన బత్తుల నాగేంద్ర వర్ధన్ నాన్నా బత్తుల సుబ్బారాయుడు మంగళవారం ఉదయం అకాల మరణం చెందారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని చీమకుర్తి మండల శాఖ ఏపీటీఎఫ్ తరుపున వారికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి చీమకుర్తి మండల ఏపీటీఎఫ్ శాఖ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నేను బడికి పోతా.. విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బల్లికురవ : బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల పరిధిలోని సీఆర్పీలు కృషి చేయాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష సెక్టర్ల అధికారులు ఏఎంఓ మోజెస్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్య సాగర్ బల్లికురవ మండల విద్యాశాఖాధికారి కె.రమేష్ బాబు అన్నారు. మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమంపై స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జూన్ 12 నుండి జూలై 12 వరకు జరిగే నేను బడికి పోతా కార్యక్రమంలో బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అదే విధంగా మధ్యలో బడిమానిన పిల్లలను మరల పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో నూతనంగా చేరిన పిల్లల వివరాలు బడి బయట ఉన్న పిల్లల వివరాలు విద్యార్థులకు సంబంధించిన విద్యాసామగ్రి పంపిణి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డి.అంకమ్మరావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ కె.గోపి, సిఆర్పిలు జి.నాగేశ్వరరావు, పి.రంగనాద్, బి.అనురాధ, బి.అశోక్ బాబు, పి.నాగబాబు, జి.నాజిని తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరం మూత

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఆహ్లాదంగా గడపడానికి సముద్ర తీరానికి వచ్చి సముద్ర స్నానంపై అవగాహన లేక అలల ధాటికి సముద్రంలో గల్లంతు అయ్యి మరణించే వారి సంఖ్య పెరుగుతున్నది. చీరాల రూరల్, మెరైన్ పోలీసులు చీరాల ఒడరేవు, ఇతర సముద్ర తీరాలలో బందోబస్తు నిర్వహిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తెలుపుతూ మైకు ద్వారా ప్రచారం చేస్తూ పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది పర్యాటకులు అత్యుత్సాహంతో సముద్రం లోపల లోతుగా ఉన్న ప్రదేశాలకు వెళ్ళి స్నానాలు చేసే క్రమంలో అలల ఉధృతికి సముద్రంలో గల్లంతు అవుతున్నారు. సరైన సమయంలో సమాచారం అందితే పోలీసు సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి సముద్రంలో కొట్టుకు పోయే వారిని కాపాడుతున్నారు. కానీ గత కొన్ని రోజులుగా సముద్ర స్నానాలు చేసే క్రమంలో యువకుల మరణాలు అధికమయ్యాయి. దీనితో పోలీసు శాఖ అప్రమత్తం అయ్యింది. వాడరేవు సముద్ర తీర ప్రాంతంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పర్యాటకులను సముద్ర స్నానాలకు అనుమతించకుండా వెనుకకు పంపుతున్నారు. వాడరేవులో ఉన్న పర్యాటకులను సైతం తిప్పి పంపుతున్నారు. విస్తృత స్థాయిలో అధిక సంఖ్యలో పోలీసు సిబ్బంది రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై ఎంవి శివకుమార్ ఆధ్వర్యంలో పర్యాటకులు సముద్రంలో స్నానాలకు దిగకుండా కట్టడి చేస్తున్నారు. ఆహ్లాదం పంచే సముద్ర స్నానాలలో మరణాలు సంభవించకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పర్యాటకులను సముద్ర తీరం ప్రాంతానికి వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చే సందర్శకులు సముద్ర స్నానాలపై అవగాహన లేక అలల తాకిడికి సముద్రంలో మృత్యు వాత పడుతున్నారని, ఇటువంటి ప్రమాదాలు నివారించే క్రమంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు సముద్ర తీర ప్రాంతంలోకి సందర్శకులను అనుమతించడం లేదని అన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : ఈ నెల 27వ తేదీన పెనమలూరు మండలం తాడిగడప- ఎనికేపాడు వందడుగుల రోడ్డు మార్గంలోని శ్రీచైతన్య కళాశాల ఎదురుగా గల స్థలంలో నిర్వహించనున్న రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు సంస్మరణ సభ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం శ్రీచైతన్య కళాశాల మీటింగ్ హాల్లో అధికారులతో సమీక్షించిన అనంతరం ఏపీ సిఆర్డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ, ఏ అధికారులు ఏ ఏ బాధ్యతలు నిర్వహించాలనే విషయంపై ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఆ ప్రకారంగా ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ సభను విజయవంతం చేయాలని సూచించారు. ప్రధానవేదికతోపాటు, బ్యారికేడింగ్ పనులు పూర్తిచేసేలా ఆర్అండ్‌బి అధికారులు పర్యవేక్షించాలని, వేదికతో పాటు రామోజీరావు చిత్రపటాలకు పుష్పాలంకరణ, ఆవరణలో పారిశుద్ధ్యం నిర్వహణ, మొబైల్ మరుగుదొడ్ల ఏర్పాటు, వేదికపై ఏసీలు, గ్యాలరీలలో కూలర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేదిక వద్ద లైటింగ్, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పవర్ బ్యాకప్ ఏర్పాటుచేయాలని, ప్రధానవేదికవద్ద సీసీ టీవీ కెమేరాలు, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రామోజీరావు జీవిత విశేషాలతో ఫోటో ఎగ్జిబిషన్, ప్రధాన వేదిక బ్యాక్ డ్రాప్, డిజిటల్ స్క్రీన్, పీఏ సిస్టమ్ ప్రత్యేక ప్రసారం, ముఖ్యమంత్రితో పాటు అతిథులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమం రోజున వేదికపై శాస్త్రీయ సంగీతం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద సూచిక బోర్డులు, సంచార మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాచర్యలు తీసుకోవడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశానికి ముందు ఏపీ సిఆర్డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంపత్ కుమార్, విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కృష్ణా ఎస్పీఅద్నాన్ నయీమ్ అస్మి, సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాషా, జి ఐ డి ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ వాణి,వివిధ శాఖల అధికారులతో కలిసిసభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి ప్రసాద్, సమాచారశాఖ అదనపు డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు కిరణ్ కుమార్, టీ కస్తూరి, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కృష్ణారెడ్డి గుడివాడ, ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ల అధికారులు పి పద్మావతి, డి.రాజు, గుడివాడ, తాడిగడప మున్సిపల్ కమిషనర్లుసు బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, ముడావీసీ వెంకటరమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

విశాలాంధ్ర-కూచిపూడి : ఒకవక్క డెంగ్యూ, మరొక పక్క వైరల్ జ్వరాలు ఇంకొక పక్క జిల్లాలో కొనసాగుతున్న డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న ఈ తరుణంలో గ్రామ పంచాయతీలు పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ లను పారిశుధ్య కార్యక్రమాలు అమలుపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో పలు ప్రాంతాలలో పర్యవేక్షిస్తుండగా గ్రామాలలోని పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది చెత్తాచెదారం తొలగించడంపై దృష్టి సారించకపోవడం పట్ల ఆయా ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం మొవ్వలో ఎండిఓ జి చంద్రశేఖర్ పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాలలో ప్రబలుతున్న వ్యాధుల దృష్ట్యా వపారిశుధ్య కార్యక్రమాలను అత్యంతప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలను పరిశుభ్రతగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇవేమీ తమకు పట్టనట్లు కొంతమంది పంచాయతీ సిబ్బంది ప్రవర్తించడం బాధ్యత రాహిత్యం గా ఉందని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అలాగే రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసేమంచినీటి విషయంలో కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించినా కొన్ని ప్రాంతాలలో రంగు మారిన నీరే కుళాయిలద్వారా వస్తుందనే ఆరోపణ సైతం వినవస్తున్నాయి. దోమల ద్వారా వ్యాప్తి చెందే పలు వ్యాధుల పట్ల పంచాయతీ అధికారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని చేస్తున్న సూచనలు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి శుద్ధి అమలుపై మంగళవారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ స్వయంగా ఎనికెపాడు నుంచి తాడిగడప వరకు గల 100 అడుగుల రహదారి మార్గంలో ద్విచక్ర వాహనంపై పారిశుధ్య పర్యవేక్షణ చేసిన విషయన్ని సైతం వాట్సాప్ లలో హల్ చల్ చేస్తున్న విషయాన్ని పలువురు ప్రస్తావిస్తూ వారి కొన్న బాధ్యత పంచాయితీ అధికారులకు సిబ్బందికి ఉండదా??అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య అమలుపై, పరిశుభ్రమైన మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలని పేర్కొంటున్నారు.

డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు పాలి టెక్నిక్ లో గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ మరియు యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత గుడివాడ రూరల్ సీఐ కె.ఏసుబాబు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో సమాజంలో వచ్చే దుష్పరిణామాలు మరియు ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కావున విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు. అనంతరం గుడివాడ డి.ఎస్.పి శ్రీ పి. శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలాంటి పదార్థాలు డ్రగ్స్ కిందకి వస్తాయి? వాటికి విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అవుతారు? అనే అంశాల గురించి విపులంగా వివరించారు. యువత దేశానికి పట్టు కొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు మరియు సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సీఐ కె. ఏసుబాబు, గుడ్లవల్లేరు ఎస్సై జి. సత్యనారాయణ ఇతర పోలీస్ సిబ్బంది, గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శ్రీ ఎన్.రాజశేఖర్, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

గోపీ కుటుంబానికి అండగా జనసేన

విశాలాంధ్ర-శింగరాయకొండ : మారుబోయిన గోపి కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని మండల జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడుసుమల్లి సుధాకర్ అన్నారు. శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన మారుబోయిన గోపి దురదృష్ట వశాత్తూ మరణించాడు. ఆ కుటుంబానికి తమవంతుగా అండగా నిలవాలని అడుసుమల్లి సుధాకర్ ఆధ్వర్యంలో కనపర్తి సుధాకర్‌రెడ్డి సహకారంతో ఆ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎస్‌డి చాంద్‌బాషా, మండల అధికార ప్రతినిధి నాగరాజు, అజయ్, సాయి, అమీర్, అజయ్‌కుమార్, అమీర్, ఈశ్వర్లు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

పెదారికట్లలో మట్టి నమూనాల సేకరణ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పెదారికట్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కె ప్రసన్న రంగ లక్ష్మి ఆధ్వర్యంలో దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కే బాలాజీ నాయక్ పర్యవేక్షణలో రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని గురించి ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. మట్టి పరీక్షలు ఆవశ్యకతను గురించి రైతులకు తెలిపారు. వ్యవసాయ అధికారి ప్రసన్న రంగ లక్ష్మీ మాట్లాడుతూఈ ఏడాదిలో మండలంలో 744 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించాల్సిన ఉందని, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రానికి పంపడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరామ్, అరవింద ,ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-బేస్తవారిపేట : జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారితాధికారి ఆదేశాల మేరకు బేస్తవారిపేట సహాయ సాంఘిక సంక్షేమాధికారి పరిధిలోని 8 ప్రీ మెట్రిక్, 3 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్ డబ్ల్యూఓ ఇ.రాజేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తర్లుపాడు, కొనకనమిట్ల, పెదారికట్లలోని బాలుర, కంభం బేస్తవారిపేటలలోని బాలుర, బాలికల వసతి గృహాలలో ప్రవేశాలు జరుగుతున్నాయని, ప్రీ మెట్రిక్ వసతి గృహాలలో 3 నుండి 10వ తరగతి, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్ నుండి పీజీ వరకు ప్రవేశా లుంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పదవ తరగతి విద్యార్థులకు ట్యూటర్స్ ను నియమించడంతో పాటు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను అందజేయడం జరుగుతుందని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రులను కోరిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ, ఎక్సైజ్, విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించి రాజకీయ కారణాలతో అర్థాంతరంగా తొలగించే విధానాన్ని ఆపాలని, శిక్ష అభియాన్ కార్మికులకు మినిమం టైమ్స్ స్కెల్ వర్తింప చేయాలనే సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య, ఏఐటీ యూసీ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రమేష్‌బాబు, బాలాకాశులు మంగళవారం అమరావతి సచివాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సంవత్సరాలుగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్కావేంజర్స్,మోడల్ స్కూల్ హాస్టల్స్ వర్కర్స్ తదితర మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అభ్యంతరంగా తొలగించే విధానాన్ని అధికట్టాలని వారు కోరారు.. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 134 మోడల్ స్కూల్ హాస్టల్ లో వర్క్ చేస్తున్న చెప్పిందని రెగ్యులర్ చేయాలని పార్ట్ టైం వర్కర్స్ కి ఉద్యోగ బద్రత కల్పించాలని వారు కోరారు.. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ సమ స్యలు పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా బేవరేజెస్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలపై దృష్టికి అంగీకరించాలని వారు కోరారు.. ప్రభుత్వంలో పెట్టిన ఇబ్బందులు ఈ ప్రభుత్వంలో లేకుండా ప్రభుత్వం చూడాలని వారు మంత్రులను కోరారు. విద్యుత్ మీటర్ రీడర్స్ మరియు సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర నాయకులు శివారెడ్డి, విజయ్, రామకృష్ణ, మోహన్ రెడ్డి, స్వాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని విత్తన దుకాణాలను స్క్వాడ్ అధికారి, కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఇ. వెంకటరమణ మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన దుకాణదారులు రైతులకు తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలని, రిజిస్టర్లు, బోర్డులు అప్డేట్ చేసుకోవాలని, కంపెనీ వారిచే ఉత్పత్తి చేయబడి ప్యాకింగ్ చేసిన విత్తనాలను మాత్రమే అమ్మకాలు చేపట్టా లని డీలర్లను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో విడి (లూజు) విత్తనాలను అమ్మకాలు చేపట్టరాదని, అట్లు అమ్మినచో విత్తన చట్టం ప్రకారం సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విత్తన దుకాణాల్లో విత్తనాల నమూనాలను సేకరించి సంబంధిత ల్యాబ్ కు పంపించాలని సూచించారు. అనంతరం విత్తనాల నిల్వ రిజిస్టర్లు, రశీదులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్, రైతులకు ఇచ్చిన బిల్లులను పరిశీలించారు. దుకాణాల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని రూ. 12,03,650ల విలువ కలిగిన 26 క్వింటాళ్ల విత్తనాలను నిలుపుదల చేశారు. పీసీలు సమర్పించిన వెంటనే రీవోక్ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిన్నాభిన్నం : ఎస్సై

విశాలాంధ్ర-కంకిపాడు : మండలంలోని ఈడుపుగల్లు హైస్కూల్లో మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. స్థానిక ఎస్సై సందీప్ మాట్లాడుతూ నేటి యువత మాద ద్రవ్యాలకు ఆకర్షణై చెడు వ్యసనాలకు బానిసై బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు వాడకం వలన మీ కుటుంబ సభ్యులు ఎంత బాధకు గురవుతున్నారో అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సరదగా చేసుకునే అలవాటు మానలేని విధంగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'వర్ల' విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: పామర్రు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వర్ల కుమార రాజా విజయోత్సవ ర్యాలీ భాజా భజంత్రీలతో మంటాడ నుండి లంకపల్లి వరకు నిర్వహించారు.మంగళవారం ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పామర్రు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే గా వర్ల కుమార రాజా గెలుపొందటంతో ఆయనికి తేదేపా,జనసేన నాయకులు కార్యకర్తలు తో జోడు గుర్రాల రథంలో వర్ల మంటాడ శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం కి వెళ్లి ఆలయ అధికారులు స్వాగించి ప్రత్యేక పూజలు చేసి ఘనంగా సన్మానించారు. .అభిమానులు మహిళలు భారీ సంఖ్యలో అభినందన ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం నాయకులు తో పాటు జనసేన నాయకులు తాడిశెట్టి నరేష్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : లోకో రన్నింగ్ ఉద్యోగుల దీర్ఘకాలకంగా ఉన్న అనేక సమస్యలను తక్షణం రిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ అధ్యక్షులు ఎమ్.వెంకటేషన్ సెక్రటరీ కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.ఈనెల 1 నుండి దక్షిణ రైల్వే ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ చేస్తున్న ఆందోళనకు మద్దతుగా మంగళవారం రన్నింగ్ స్టాఫ్ కుటుంబాలతో కలసి రైల్వే ఇనిస్ట్యూట్‌లో ఒక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ భారతీయ రైల్వేలో అందరి కార్మికులకు ఇచ్చినట్టుగా రన్నింగ్ సిబ్బందికి కూడా (16+30) వారాంతపు విశ్రాంతిని ఇవ్వాలన్నారు.రన్నింగ్ స్టాఫ్ విధులను 8 గంటలకు పరిమితం చేయాలన్నారు.రాత్రి డ్యూటీలను వరుసగా రెండు రాత్రులకు పరిమితం చేయాలి,హెడ్ క్వార్టర్ నుంచి బయలుదేరిన రన్నింగ్ స్టాఫ్‌ను 48 గంటల లోపలనే తిరిగి తీసుకొని రావాలన్నారు.రన్నింగ్ స్టాఫ్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు.రన్నింగ్ స్టాఫ్ తమ సామాజిక జీవితాన్ని కోల్పోయి వారాంతపు విశ్రాంతి లేకుండా పనిలో భద్రత కరువై డ్యూటీలు చేస్తున్నారన్నారు. తమ సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి,విజవాడ,బిట్రగుంట,కృష్ణపట్నంలో విధులు నిర్వహిస్తున్న రన్నింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

వేలకోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై

సీబీఐ విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా వేలకోట్ల టిడిఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని ఆనాటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అప్పటి ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని సమతా సైనిక రాష్ట్ర అధ్యక్షులు పాలేటి మహేశ్వర్ రావు తెలిపారు.మంగళవారం సమతాసైనిక్ దళ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలను అడ్డాగా చేసుకొని టిడిఆర్ బాండ్ల కుంభకోణం చేపట్టారని అనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పటి రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సి.ఎం.ఓ లో ఉన్న ధనుంజయ రెడ్డి వీరు ముగ్గురు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.ప్రజలు తమ ఇంటి నిర్మాణాల కోసం కొన్ని ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న కట్టడాలు క్రమబద్ధకరించుకునేందుకు టిడిఆర్ బాండ్లు వీరి వద్ద నుంచి కొనుగోలు చేశారన్నారు.ఆనాటి మంత్రి కారుమూరికి బినామీగా ఉన్న పులుపు అనిల్ కుమార్ ఈ కుంభకోణంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు.అప్పట్లో ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ నామమాత్రంగా చేయించి అనిల్ బుట్ట దాఖలు చేయించారని స్పష్టం చేశారు.ఈ భారీ కుంభకోణంలో వేల కోట్లు చేతులు మారాయని సిబిఐ, ఈడి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి ఆధారాలతో రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో సమతా సైనిక్ దళ నేతలు సురేంద్రబాబు,శ్వేత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో ప్రజలు భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-కనిగిరి : పట్టణంలో శాశ్వతంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.కనిగిరి పట్టణంలో లో-ఓల్టేజి విద్యుత్ సమస్య ఉందని అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసి ఉన్నారు.కానీ ప్రజలు వాటిని ఉపయోగించుకోకపోగా ప్రజలు సహకరించక పోవడంతో కొన్ని ప్రాంతాల్లో మంజూరైన ట్రాన్స్ఫార్మర్లు రద్దు అయ్యే పరిస్థితి ఏర్పడిందని, అలా కాకుండా విద్యుత్ సమస్యలు పరిష్కారం కావాలన్నా, పట్టణంలో మెరుగైన విద్యుత్తు కావాలన్నా, ప్రజలు సహకరించి ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు వారి యొక్క సహాయ సహకారాలు అందిస్తే వెంటనే విద్యుత్ సమస్యలు పరిష్కారమై పట్టణంలో మెరుగైన విద్యుత్తు కు అవకాశం ఉంటుందని చైర్మన్ తెలిపారు.అర్బన్ కాలనీ లో ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తిఅయి త్వరలో స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ప్రారంభం కానున్నదని దాని వలన చాలా వరకు విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ పవన్ కుమార్ కాంట్రాక్టర్ బేరి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఒమ్మెవరం గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తుల సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి ఆయా వైద్యశాలల వైద్యులు ఎన్ శివకృష్ణ చైతన్య కార్డియాక్ సెంటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రుగ్మతలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులను చేశారు. అదేవిధంగా సర్జరీలు అవసరమైన వారికి వైద్యశాలకు రిఫర్ చేశారు ఆరోగ్యశ్రీ సౌజన్యంతో వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తానని కార్యక్రమంలో గ్రామస్తులు ఆయా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

గోపికృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం: వేగేశన

విశాలాంధ్ర - కర్లపాలెం : అమెరికాలో దుండగులు జరిగిన కాల్పుల్లో మృతి చెందిన గోపికృష్ణ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని యాజలి గ్రామానికి చెందిన గోపికృష్ణను ఇటీవల అంగంతకుడు పని చేసే స్టోర్‌లో గన్‌తో కాల్చి చంపేశాడు. దీంతో శోక సంద్రంలో ఉన్న కుటుంబీకులను వేగేశన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

గోపికృష్ణ కుటుంబీకులకు బిగ్‌బాస్ ఫేమ్ కౌశల్ పరామర్శ

విశాలాంధ్ర - బాపట్ల : కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన దాసరి గోపికృష్ణ ఇటీవల అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బిగ్ బాస్ సీజన్ 2 విజేత కౌశల్ గోపికృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మను మర్యాదపూర్వకంగా కలిసి గోపికృష్ణ తండ్రి అనారోగ్యంతో ఉన్నారని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బాపట్ల తన భార్య స్వగ్రామం అని తాను బాపట్ల ప్రజలకు తన వంతుగా సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలని బాపట్ల మోటారు వాహన తనిఖీ అధికారి ప్రసన్న కుమారి తెలిపారు. తెలిపారు. బాపట్ల-కర్లపాలెం రోడ్డులో విద్యానగర్ వద్ద మంగళవారం ఏఎంవీఐ కిషోర్, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు.

సరైన ధృవీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు.

18 సంవత్సరాలు నిండని మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలను నడుపుటకు ఇచ్చి ఇబ్బంది కొనితెచ్చుకోవద్దని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని తెలిపారు. వాహనాల సరిపడా పత్రాలు ఉంచుకోవాలని సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, విధిగా ప్రతి ఒక్కరు నియమాలు పాటించాలన్నారు.

ఇసుక క్వారీలు తెరిపించండి

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు నాగాంజనేయులు

విశాలాంధ్ర - రేపల్లె : నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించి ఇసుకను ప్రజలకు అందుబాటులో తీసుకు వచ్చి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధిని కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇసుక క్వారీలను తెరిపించాలని కోరుతూ రేపల్లె తాలూకా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోయి ఆకలి చావులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఇసుక పాలసీని తీసుకు రావడంతో పాటు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నాగాంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, దాసరి శ్రీనివాసరావు, ఎ.కాళిదాసు, వై.శ్రీనివాసరావు, సూర్యచంద్రరావు, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమర్థవంతమైన అధికారి కలెక్టర్ రంజిత్‌బాషా: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ఎన్నికలు సమర్థంగా నిర్వహించిన మంచి అధికారి, నాయకుడిగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నిలిచారని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సాధారణ బది లీలో భాగంగా బాపట్ల జిల్లా నుండి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళుతున్న రంజిత్ బాషాను మంగళవారం జరిగిన వీడ్కోలు సభలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎన్నికలు జయప్రదంగా నిర్వహించారన్నారు. ముందుగా ఎదురయ్యే సంఘటనలు, పరిస్థితులను అంచనావేయడం వలన సమస్యలు ఉత్పన్నం కాకుండా సూక్ష్మ ప్రణాళికతో పనిచేశారని వివరించారు. నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయడం, ప్రతి అంశంపై అవగాహన, పట్టు ఉండడంతోనే ఎన్నికలు సజావుగా సాగాయన్నారు. బాపట్ల జిల్లాలో కలెక్టర్ రంజిత్‌బాషా మంచి పేరు సంపాదించారని, అలాగే బదిలీపై వెళుతున్న కర్నూలు జిల్లాలోనూ మంచి పేరు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువ పుష్పమాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా అధికారులు, చీరాల, రేపల్లె ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం: సీఐ

విశాలాంధ్ర - చీరాల : చిన్నపాటి గొడవ పెద్దదై హత్యకు దారితీసి ఒక మనిషి ప్రాణం పోయిందని ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తానని చీరాల ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావు అన్నారు. చీరాల సంఘం థియేటర్ సెంటర్లో కంచర్ల సంతోష్ హత్యకు సంబంధించి చీరాల ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ నీరు పారబోసిన విషయమై మొదలైన గొడవ చినికి చినికి హత్యకు దారితీసిందని అన్నారు. 23వ తారీకు పండ్ల వ్యాపారి వద్ద పనిచేసే ఉమామహేశ్వర రావు మంచినీటి బండి వచ్చి డబ్బాలో నీరు పారబోసి నీరు పట్టి వెళ్తున్న క్రమంలో సంతోష్ తల్లి పైడి రాజు నీరు రోడ్డు మీద పరబోసావు కొట్టు వద్దకు వస్తున్నాయని బండి అతనిని అడుగగా అతను క్షమాపణ చెప్పి వెళ్ళాడని ఇదే విషయమై ఉమ మహేశ్వరరావుకు పైడి రాజుకు వివాదం జరుగగా ఆమె సంతోష్‌కి ఫోన్ చేసి గొడవ విషయం తెలిపిందని అన్నారు. మిల్స్ తీసుకొచ్చిన సంతోష్‌ను కూరలు దించాక పండ్ల వ్యాపారి ఎసెబు ఉమ మహేశ్వరరావులు గొడవ పడి ముక్కుపై దాడి చేసి ఏసోబు పొడవమని ఉమ మహేశ్వర రావుకు చెప్పగా అతను మూడు పోట్లు పొడిచారని అన్నారు. హాస్పటల్‌కు వెళ్లిన సంతోష్ మరణించాడని ఒక మనిషి చావుకు కారణమైన వారిని దండుబాట రోడ్డులో అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. జిల్లా ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల ఒకటవ పట్టణ ఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు సహకరించాలి: ఎస్సై

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలో ఉన్న ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై ఆయన దృష్టి సారించి జిబిసి రోడ్డులో వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ వాహనం సంబంధించిన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తి మాత్రమే వాహనాన్ని నడపాలని, మితి మించిన వేగంతో వాహనం నడపడం ద్వారా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, నిదానంగా వారి గమ్యస్థానాలు చేరుకోవా టలన్నారు. ట్రాఫిక్ నిబంధన పాటించని వారికి అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ వెంట ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ విక్టర్, మాణిక్యరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు గుర్తింపు కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె డివిజన్ ఎక్స్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియే షన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎక్స్ సర్వీస్ మెన్, ఎక్స్ సర్వీస్ వీడో ఉమెన్, మెన్ రాను రాను వృద్ధాప్యం పై పడటంతో వారికి కావలసిన ఐడి కార్డులు, డిఫెండెంట్ ఐడి కార్డులు, విడో ఐడి కార్డులు, ఏపీ సైనిక్ డాక్యుమెంట్ ఆన్లైన్ తదితర సమస్యలపై, డివిజన్లోని నిజాంపట్నం, నగరం, బట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి ప్రాంతాల నుండి ఎక్స్ సర్వీస్ మెన్లు ఉచిత సర్వీస్ శిబిరానికి వచ్చారు. జిల్లా అధికారిని ఆర్ గుణశీల, సూపరిండెండెంట్ డి.ఆనంద్‌రావు, కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన శిబిరంలో వారికి కావలసిన వివిధ రకాలైన సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రేపల్లెలోనే అసోసియేషన్ వారికి కార్డులు పంపిణీ చేయడం జరిగిందని అధికారిని గుణశీల తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మహబూబ్ సుభాని, ఉపాధ్యక్షులు వి.సుబ్రహ్మణ్యం, సెక్రెటరీ ఏఆర్ రత్న శేఖర్, కమిటీ సభ్యులు, ఎక్స్ సర్వీస్ మెన్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా ప్రెసిడెంట్‌గా దేవర వినోద్

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా అధ్యక్షుడుగా మళ్లీ దేవర వినోద్‌ను ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా యూనిట్ బాపట్ల జిల్లా ప్రెసిడెంట్ కె.రోశయ్య బాపట్ల జిల్లా సెక్రెటరీ పసుమర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జనరల్ బాడీ మీటింగ్ నూతన కమిటీ సభ్యుల ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకాశం అతిథి భవనంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడు దేవర వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై పోరాడతామని ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల తాలూకా సభ్యులు చీరాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.